

# వేటూరి సాహితీ ఝరి



తెలుగుచలనచిత్రచరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో లిఖించుకున్న శ్రీ వేటూరి సుందరరామమూర్తి గారు, సినీరంగప్రవేశానికి ముందే ఎన్నో కవితలు, గేయాలు, గేయరూపకాలు, కథలు, వ్యాసాలు, సినీ సమీక్షలు, సీరియల్స్ వ్రాశారన్న విషయం అందరికీ తెలిసి ఉండకపోవచ్చు. ఆ రోజుల్లో వారి కలంపేర్లు కొన్ని - శుభశ్రీ, రామం, సరళ.. వేటూరిగారి సినిమాయేతర సాహిత్యాన్ని పాఠకులకి అందించడమే ఈ శీర్షిక ముఖ్యోద్దేశం. ఈ అంశాలని కౌముదికి అందించిన, పునర్ముద్రణకి అనుమతించిన వేటూరి రవిప్రకాష్(సుందరరామమూర్తిగారి పెద్ద కుమారుడు)గారికి కౌముది ధన్యవాదాలు తెలియచేస్తోంది.

## ఆంధ్రహృదయేశ్వరుడు శ్రీరాముడు

## తెలుగు వారి జీవితమంతా రామమయం

(1960 ఏప్రిల్ - ఆంధ్రపత్రిక వారపత్రిక నుంచి)


ఆంధ్రహృదయేశ్వరుడు శ్రీరాముడు
తెలుగువారి జీవితమంతా రామమయం

**శ్రీరాముడు ఆంధ్రుల ఇష్టదైవం** – ఇహం, పరం. జగన్నాటకరంగంలో తెలుగుజీవితం ఒక రామనాటకం. తెలుగువారికి, శ్రీరామచంద్రుడికిగల అనుబంధ ప్రబంధం మరో రామాయణం. కాదు రామలీల.

"అయోధ్య రామయ్య అన్నయ్య మాకు
వాలుగన్నుల సీత వదినమ్మ మాకు
రాములంతటివాడు రట్టుపడ్డాడు
మానవులకెటమ్మ మాట పడకుండ,
సీతమ్మ రామయ్య దారిగదిలీ తె

పారిజాతపు పువులు పలవరించినవి.

దండమ్ము దండమ్ము దశరథ రామ

దయతోడ మముగావు దాక్షిణ్యధామ."

ఇలాటి పాటలు పనిపాటలు చేసుకుంటూ ఇల్లాళ్ళు పాడుకుంటారు.

"దశరధుడను పేర తుమ్మెదా

ఒక

ధరణీకుడున్నాడు తుమ్మెదా."

వంటి తుమ్మెద పదాలు "రామన్న రాముడోయ్ రామభజనా" వంటి భజనలు, కోవెల పదాలు, చందమామ పదాలు, జాజిరలు, ఎన్నో తెలుగునాట ప్రతినోట వినవస్తాయి.

నాటక రంగంలోను, చలనచిత్రాలు వచ్చిన తర్వాత వాటిలోను, రాముని గూర్చిన పాటలెన్నో వెలువడ్డాయి. పోతన, వంటి చిత్రాలలో వెలువడిన రామకీర్తనలు మరపురానివి. బలిజేపల్లి, సముద్రాల, దైతా గోపాలం వంటి వారు వ్రాసిన గీతాలు ఊరూరా మారుమ్రోగినవి శ్రీరాముడు ఆంధ్రుల ఇష్టదైవం. ఇలవేల్పు. ఆయన మాననీయుడైన పూర్ణ మానవుడు కావటమే అందుకు కారణం. ఒకమాట, ఒక బాణం, ఒక భార్య – ఇది ఆయన ప్రతిజ్ఞ. ఆయన సత్యపరాక్రముడు. జగమంతా నాటకరంగం. అందులో తెలుగు జీవితం ఒక రామలీల.

శ్రీరామచంద్రుడు అఖిభుజ నేత్రాభిరామాంగధాముడనీ, పతితపావనుడనీ సత్యవిక్రముడనీ, ఉదారుడనీ ప్రేమమయుడనీ పురుషోత్తముడనీ భారతజాతి పునాది ఎరుగని అనాదినుండీ కీర్తిస్తూనే ఉన్నది. అలాగే కృష్ణా, గోదావరి తరంగిణితరంగిత మైన ఆంధ్రదేశంలో ప్రజలు కూడా చిరకాలంగా రామభక్తులు. శ్రీరాముడు గుణములచేత ఆంధ్రుడని అభ్యూహించుకుని ఆంధ్రహృదయం ఆనందంతో స్పందిస్తుంది.

అంతేకాదు ఆంధ్రుల ఆనందాతిరేకానికి మరో గర్వకారణంకూడా ఉంది. ప్రియావియోగక్లేశంతో బొగ్గులు వారియున్న గుండెతో రామచంద్రుడు దండకారణ్య ప్రాంతాలకు వచ్చినప్పుడు ఆయనకు అనునయం కల్గించి, దుష్టరావణుని వధ అనే కథను నడిపించిన జెగజెట్టులు ఆంధ్రులే. నాటి కిష్కింధ, నేటి మన బళ్ళారి ప్రాంతమనే విశ్వాసం చాలామందికి ఉంది. దక్కన్ పీఠభూమి దండకారణ్యమని చెబుతారు. నాడు శ్రీరాముడు గోదావరి తీరంలో లక్ష్మణునితో సహా సంచరించాడని, నేటి భద్రాచలప్రాంతంలో 'పంచవటి ' అనే ఆశ్రమంలో విశ్రమించాడని జనశ్రుతి. శ్రీరాముడు ఆ విధంగా ఆంధ్రదేశంలో విశ్రాంతి తీసుకున్నాడు. రావణ సంహారానికి ఆయన చేసిన జైత్రయాత్రలో అసలు మజిలీ ఆంధ్రదేశమే. కిష్కింధా మండలేశ్వరుడుగా సుగ్రీవుడు రామచంద్రుని వల్లనే పట్టాభిషిక్తుడయినాడు. రావణ సంహారానికి తన సేనలైన వానరులను పంపుతానని మాట చెల్లించుకున్నాడు. ఆ విధంగా సీతారాముల పునస్సమాగమానికి ఆంధ్రులు సంధానకర్తలైనారు. ఈ వానర సేనలో ఆంజనేయుడు శ్రీరాముని నమ్మినబంటుగా ఉండి ఆంధ్రుల కీర్తిని నిలబెట్టిన మహనీయుడు. ఆంధ్రుల భక్తి తత్పరతకు తొలి సంకేతం ఆంజనేయుడని మనం చెప్పుకోవచ్చు. శ్రీరామభక్తి పరవశత్వమే ఆంజనేయునిలో సత్వం. అది మనకు వారసత్వంగా మిగిలిపోయింది.

ఆనాటినుంచీ ఆంధ్రులకు శ్రీరామ చంద్రుడు ఇష్టదైవమయినాడు. శ్రీరామపాద పవిత్ర చిహ్నలతో ఆంధ్రదేశం తరించింది. ఆయన విశ్రమించిన పంచవటీ కుటీరం భద్రాచలమై ఆంధ్రులకు పుణ్య క్షేత్రమైనది. సీతారామపునస్సమాగమకర్తలైనందుకు ఆంధ్రులు తరించినట్లు భావించారు. భావిస్తారు.

**గీత రామాయణం.**

తెలుగు దేశాన మహాభక్తులెందరో ఉద్భవించి రామనామం కీర్తనంగా దునికి నర్తనంగా జీవించారు. వారికి అంతరంగంలో ఆత్మారాముడు, జగత్తంతా అనంతరాముడు. వారికి అంతా రామమయం.

గౌతమీ, కృష్ణ, పినాకినీ తరంగిణీత్రయం వలె 'త్యాగరాజు, గోపరాజు, పోతరాజు అనే భక్తిరస తరంగిణీత్రయం' కూడా ఆంధ్రదేశాన్ని పండించింది. రామనామ సంకీర్తనా వాఙ్మయం ఆంధ్ర వాఙ్మయానికి జీవం. ఎన్నెన్నో భక్తికవితలు, మధుర కవితలు, జానపద కవితలు కూడా ఆంధ్రులకు ఉన్నాయి.

రామ కథాసుధ కన్న వసుధలో సుధ ఏమున్నదని త్యాగరాజు ఆత్మవిచారం. రాముని సన్నిధికన్న నిధి ఏమి కావాలని ఆయన ప్రశ్న. 'శ్రీరామ నామామృత పానమనుసోపానము ' ముక్తి శిఖరాలందుకోడానికి ఆలంబనమని ఆయన హృదయం. ఒకమాట, ఒక బాణం, ఒక సతి – ఇవే శ్రీరామావతారమని – మానవతా పరిపూర్ణమైన ఏకైక లక్ష్యమని ఆయన నిశ్చయం

తెలుగుల పుణ్యపు ప్రోవు శ్రీ బమ్మెర పోతరాజు మహాభక్తుడు. ఆయన కారణజన్ముడు. పునరావృత్తి రహితమైన మహా కార్యమే ఆయన భాగవత మహాకావ్యం.

'పలికెడిది భాగవతమట
పలికించెడివాడు రామభద్రుండట నే
పలికిన భవహరమగునట
పలికెద వేరొండు గాథ పలుకగనేలా!'

శ్రీరామ ప్రేరితమే భాగవతం శ్రీరాముడు తన స్వీయగాథాలహరి రచించుకొనడానికి పోతన్నగారు ఒక సాధనామాత్రుడె అయినారనిపిస్తుంది. ఇక కంచెర్ల గోపరాజు 'రామదాసు'గా చిరంజీవి. ఆయన చిన్నతనంలోనే తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని' అని ఆనంద కీర్తన చేసినాడు 'ఏ తీరుగ నను దయచూచెదవో ఇనవంశోత్తమ రామా – నా తరమా భవసాగరమీదను నళినదళేక్షణ రామా' అనే ఉత్కంఠ ఆయన కంఠమై ప్రౌఢ వయస్సు నాగ్రూప తపస్సు అయింది. వయః పరిపాకంలో రామదాసు త్రికాలసత్యాలైన అనేక సూక్తులను ఉచ్చరించాడు:

'అంతా రామమమయం ఈ జగ
మంతా రామమమయం.
అంతరంగమున ఆత్మారాముడ
నంత రూపుడై' ఉన్నాడని రామదాసు నాడు అనుభవం భావంకాగా కీర్తనలోకి అనువదించాడు.

"అకలంక గుణపూరుడూ, ఆర్యా మనోహరుడూ సకలలోకాధారుడూ, మునిమనోజలజాత సంచారుడూ" అని శ్రీ రామచంద్రుని బాలునిగా చేసి రామదాసు –

"బూచివాని బిలువనంపదా –
రామశైల భద్రగిరి రామదాసు నేలు స్వామి
కామితార్ధ ఫలములొసగి కైవల్యము జూపునాడ."
అని ఉజ్జగిస్తూ మందలించాడు కూడా

**త్యాగరాజు**

ఆంధ్రుల రామభక్తి చరిత్రలో అనేక మధురఘట్టాలున్నాయి. అందులో భక్తిరసగంగా ప్రవాహానికి త్యాగరాజు జీవిత ఘట్టం మణికర్ణిక. రామభక్తి పరవశుడై ఆ మహనీయుడు అనేక సత్యాలు వక్కాణించాడు. సప్రయోజనమయిన వాఙ్మయం వాగ్గేయరూపంలో త్యాగరాజు నోటివెంట వెలసింది. కడప మండలంలో కాకర్ల గ్రామనివాసి అయిన కాకరల పంచవద బ్రహ్మం అనే శిష్టాచార సంపన్నుడు దక్షినాపథానికి పయనమై తిరునారూరు (తిరువడి) అనే గ్రామంలో స్థిరనివాసి అయినాడు. ఆయనకు పాత్రుడై అక్కడి పంచనదీశ్వర ఆలయ ప్రాంగణంలో త్యాగరాజు వాగ్గేయాలు అనేకం రచించాడు. త్యాగరాజు భావావేశ పరవశుడు మాత్రమే అయిన కవికాదు. అనుభూతి విశేషాలలోని సత్యాసత్యాలు గ్రహించిన మహానుభావుడు. తాను మహనీయమని తలచిన ధర్మం ప్రకటించిన ప్రవక్త, భక్తిపారవశ్యంలో శరణాగతి, ప్రపత్తి, కరుణ, సరసం, ఇలా నవరసభరితంగా కృతులు చెప్పిన మహావాగ్గేయకారుడు ఈయన పురుషాయుష్కుడై 1846లో ప్రమపదించాడు.

'రామాయన చపలాక్షుల పేరు
కామాదుల పోరు వారు వీరు
రామాయన బ్రహ్మమునకు పేరు
ఆ మానవ జననార్తులు దీరు"

కనుక 'తెలిసి రామచింతనతో నామము సేయవె ఓ మనసా' – అని కామతమోవృతులకు జ్ఞానపూర్ణ చంద్రికను ప్రసాదించిన శశాంకుడు త్యాగయ్య. సుందరరాముని మోహనాకారం త్యాగయ్య దర్శించి పరవశించాడు.

"చెలువు మీరగను మారీచుని
 మదమణచే వేళ
అలకలల్లలాడగ గని ఆ
 రాణ్ముని యెటు పొంగెనో"

అని ఆలపించాడు.

"రామభక్తి సామ్రాజ్య మే
 మానవుల కబ్బెనో
ఆ మానవుల సందర్శన
 పరమానందమే మనసా"

అని రామభక్తిలో పరాకాష్ట నందినాడు.

కాగా –

'సంసారులైతే నేమయా శిఖి
పింఛావతంసుడెదుట నుండగ ' అనే నూతనతత్వం రాజయోగం ఆయన ఉపదేశించాడు.

'రార సీతారమణీ మనోహర
నీరజన మన ఒక ముద్దీర ' అని శ్రీరామ బాలుని జేరపిలిచాడు.

"నగుమోము గనలేని నా జాలీ తెలుసుకో ' అని శ్రీరాముని వృద్ధుడై రుద్ధ కంఠంతో వేడుకున్నాడు. 'ఏల నీ దయరాదు పరాకు జేసేవేలా? ' అని బుజ్జగించి భగవంతుని ప్రశ్నించాడు. శ్రీరామభక్తి త్యాగరాజస్వామిని నిఖిల రసానందుని చేసింది .నవరసాలు కొలచిపోసిన

వాగ్గేయాలతో రామపూజ నిర్వర్తించిన త్యాగరాజు, ఆంధ్రుల రామభక్తికి అమరసంకేతం. అలాగే ఎడ్ల రామదాసు, తూము నరసింహదాసు, మొదలైన మహాభక్తుల రామనామ కీర్తనలు మరపురానివి.

**కావ్య రామాయణం**

వాగ్గేయాలు అటుంచి ఆంధ్ర కావ్య ప్రపంచంలోకి వచ్చినా అనంతరూపుడై రాముడే కనిపిస్తాడు. రామకథను పునః పునః రచించి ఒకరికన్న ఒకరు జెగజెట్టులనిపించుకున్నారు తెలుగు కవులు. శతక వాఙ్మయంలో దాశరథీ శతకం నోటికిరాని తెలుగుతనానికి ఒక అణాలోపిస్తుంది. పదిహేనణాల తెలుగు వారికి సైతం ఒక పద్యం నోటికి వచ్చి ఉంటుంది.

. వసుచరిత్ర కర్త అయిన భట్టుమూర్తి కృత్యాదిని శ్రీరాముని కళ్యాణలీల ప్రశంసించాడు. అయ్యలరాజు రామభద్రుడు రామాభ్యుదయమనే కావ్యం రచించాడు.

ఇక రామాయణాలు తెలుగులో వెలసినన్ని మరే యితర భాషలోనూ వెలయలేదేమో! చారిత్రకుల పరిశోధనా వలయంలోకి వచ్చినవే శతాధికం ఉంటాయి. వీటిలో హుళక్కి భాస్కరుని 'భాస్కర రామాయణం ' లబ్ధ ప్రతిష్టమైనది. 'రంగనాథ రామాయణము ', 'మొల్ల రామాయణము ', 'కటా వరద రాజకవి రామాయణము ', 'రఘునాథ రామాయణము ' గోపీనాథ రామాయణము, ఆనంద రామాయణము బహుజనాదరణ పాత్రంలైన కావ్యములు, కంకంటి పాపరాజు 'ఉత్తరరామాయణమూ అనితర సామాన్య శైలీ గాంభీర్యము కలది. తిక్కన మహాకవి 'నిర్వదనోత్తర రామాయణము ' ఒక మహాకావ్యము. ఎర్రన కూడా 'రామాయణము ' రచించినట్లాధారాలు ఉన్నవికాని అది లభ్యము కాకపోవుట ఆంధ్రుల దురదృష్టము. ఇవికాక శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి 'రామాయణము ' ఒకటి ఉన్నది. కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము ' రసనిర్భరమైన ప్రౌఢకావ్యము. కాగా తులసీదాస హిందీ రామాయణమునకు భాగవతుల వారి తెలుగు అనువాదము, కంద రామాయణమునకు శ్రీ పూతలపట్టు శ్రీరాములు రెడ్డి అనువాదము ప్రత్యేకించి చెప్పుకొనవచ్చును ఆంధ్రవాల్మీకి వావిలికొలను సుబ్బారావు, తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్య, సరస్వతుల సుబ్బరామ దీక్షితులు, రచించిన రామాయణములు బహుళ ప్రచారము పొందినవి. లక్కావఝ్ఝులవారి ఆశ్చర్య(అద్భుత) రామాయణానువాదం కూడా ఒకటి ఉన్నది. శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 'రామకథ ' హరికథ అమరగాన సుధ రసానంద, బ్రహ్మానందప్రద. పూర్వకవులలో కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయం ఒక అలఘు లఘుకావ్యం.ఇట్లిటీవలి శిరోమణి రామాయణం వచన రామాయణ శిరోమణి. తెలుగు వాడుక భాషలో వెలుండిన వేదుకైన రచన. మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రిగారి 'పంచవటి ' మధుర పద్యకావ్యము. మానికొండ రామాయణము. ఇట్లే బసవరాజు సుందరాచారి మున్నగువారి రామాయణాలు కూడా. తెలియనివి, అముద్రితాలు, లుప్తాలు మరెన్ని ఉన్నవో! ఇక సంస్కృత రామనాటకములు అనేకులు తెలిగించారు.

**జానపద రామాయణము**

వాగ్గేయములు, కావ్యములుపోగా, తెలుగునాటకర్త తెలియని కవిత్వాలు జానపద సాహితీ మహతి స్వరలహరులై పొంపిళుపోయినవి. అనూచానముగా లంకాయాగం, కుశలాయక, కుచ్చెల కథ, సీతవేవిళ్ళు, లక్ష్మణ దేవర నవ్వు, లక్ష్మణ దేవర మూర్ఛ, ఊర్మిళ నిద్ర, రావణ వధ, అగ్నిపరీక్ష, మొదలయిన మధుర కవితలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు పల్లెసీమలలో ప్రవర్తిల్లుతూ ప్రవర్ధిల్లుతున్నాయి. 'అంతట రాములవారు అంగన సీతనుగూడి ' ఇత్యాది పాటకథలూ ఉన్నాయి.

"ఉత్తముని పేరేమి

ఊరుపేరేమి

సత్యపురుషుల గన్న

సాధ్వి పేరేమి

ఉత్తముడు దశరధుడు

ఊరు అయోధ్య

సత్యపురుషుల గన్న

సాధ్వి కౌసల్య"

ఈ బాల, పామర, గేయాలు చిరకాలంగా వస్తున్నాయి. ఈ జానపద కవితలలో తెలుగువారి సంస్కారం హృదయం అద్దంలోవలె నిద్దంగా దీపిస్తున్నది.

'రామరామరామరామరామ ఏల పలకవు

పలుకమన్న పలుకవూ పంచదార చిలుకవు ' అని పల్లెసీమలో ప్రాయపు పొద్దు పడమటికి తిరిగిన వారి హృదయం జాలిగా స్పందిస్తుంది. నదులు దాటేటప్పుడు పడవ దాటించే పల్లెవారి నోట వెలువడే పాటల్లోనూ రాముడే.

'రామయ్య నేనొచ్చి నీ పాదములు గడికి మరి పడవ ఎక్కించుకుంటా ' అనే పామర పదాలు ఉందుకు తార్కాణం.

ఆంధ్రుల జీవితము రామనామ గానమై రామనామామృత పావమై రామనామలీనమై ఉత్తమగతి నందినది. పుట్టిననాటనుండి గిట్టువరకు వారికి 'కనులందు రాముడే కలలోన రాముడే!'

ఉంగబట్టి ఏడ్చే పసిబాలకుని చిరాకుకు రామనామమే మందు.

'రామలాలి మేఘ శ్యామలాలి

తామరస నయనదశరథ తనయలాలి

ఎంతో ఎత్తు మరిగిజాపు ఏమి చేతుర

ఇంతుల చేతికాకలకు ఎంతో కందేవు."

ఇత్యాది లాలిపాటలు – తేనె తెనుగులోని భావమధురిమల ఊటలు.

యౌవనంలో పెళ్ళి వేళ

'ఆనందమానంద మాయెనే మన

రాముడు పెళ్ళికొడుకాయెనే మన

సీతమ్మ పెళ్ళికూతురాయెనే ' అనే

మంగళగీతం – రామ నామాంకితమే. పవ్వళింపు వేళకూడా సీతారాముల ఆదర్శమే తెనుగువారి గుండెలలో తొణికిసలాడుతుంది.

"పవ్వళింపు మీరామా పడతి జానకిగూడి

ప్రొద్దోయె జాగేలనూ

ముక్కుపచ్చలారని ముగ్ధ బాలిక గాన

ఒకటాడబోతె మరొకటాడునో రామ "

సంజెవేళ దీపం పెట్టి ఇంటదోగాడే బాలగోపాలుని కళ్ళకద్దు పెద్దవాళ్ళు

"రక్ష రక్ష

సంధ్య రక్ష

సర్వ రక్ష

దీప రక్ష

దివ్య రక్ష

చిన్ని నా అబ్బాయికి

శ్రీరామ రక్ష!"

అని దీవిస్తారు. నీళ్ళుపోసి 'శ్రీరామరక్ష నూరేళాయష్షు ' అంటుంది అమ్మ. మంచి విన్నా చెడువిన్నా 'శ్రీరామ ' నామం నోటవెలువడుతుంది.

'ఇంకా సంసారముతో పొందేలా

రఘురాముని దలపక ' అనే ఆత్మ ప్రబోధం అప్పుడే అవసరమౌతుంది. అది వైరాగ్యమై కేవలం శరణాగతికి దారితీసింది 'ఎవరివాడో ఈ దేహి ' అనే తర్కవితర్కాలతో రోజులు ప్రశ్నలై వచ్చి సమాధానాలై తరలిపోతాయి. చివరకు "ఉండేది రాముడొకడు ఊరక చెడిపోకె మనసా" అనే సమాధానంతో రామలీలగా గడచిన జీవితం రామలీనమై పోతుంది. రామనామ కీర్తనానర్తనం తెలుగుజీవితం.

దైనందిన నిత్యజీవిత విధులలో రామనామం తెలుగువారికి ముఖ్యం. 'నానా జీవన నాటక కారణు 'డైన శ్రీరాముడే తెలుగు గుండెలో నలుగు. 'ఆదిమధ్యాంతరహితుడైన 'రాముడే' తెలుగు చరిత్రపరిణామం. తెలుగుజాతి పరిణతి. 'స్మిత పూర్వాభి భాషీచ పూర్వ భాషీ' అయిన రాఘవుడే తెలుగు యువతకు ధృవ తార. ఆయన సత్య పరాక్రమం మానవత తెలుగు వారు ఆరాధించే దైవం.

తెలుగు కుటుంబ జగత్తులో తాతగా, తండ్రిగా, కొడుకుగా, మనవడుగా మరలి మొగలి జన్మిస్తాడు రాముడు. 'అంతా రామమయం ' అనిపిస్తాడు.

శ్రీరామనవమి తెలుగువారికి మహా పర్వమది. 'శ్రీరాముడు ఆంధ్రహృదయేశ్వరుడు అన్న మన దేశోద్ధారకుల ప్రవచనం అనుభవ సిద్ధం.

పలికే ప్రతి పలుకు, పలికించేదీ, పలికింపబడేదీ, పలికేది కూడా 'రాముడే '

**COMMENTS**